క్లుప్తంగా

వైద్యపరీక్షలు



వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని ఆరోగ్య మహిళ కేంద్రంలో మంగళవారం వైద్యాధికారి స్నేహరెడ్డి ఆధ్వర్యంలో మహిళలకు వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా 75 మందికి పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం 12 మంది వద్ద నుంచి రక్త నమూనాలను సేకరించి పరీక్షలకు ములుగు ఏరియా వైద్యశాలకు పంపించారు. అనంతరం చిరుతపల్లి గ్రామంలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు వినయ్, యాకలక్ష్మితో పాటు తదితరులు పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక



వెంకటాపురం(కె): మండల పరిధిలోని చిరుతపల్లిలోని సమ్మక్క–సారలమ్మ ఆలయ కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా నర్సయ్య, కన్వీనర్‌గా నాగేంద్ర ప్రసాద్, కో కన్వీనర్‌గా కోర్స నరసింహమూర్తి, కోశాధికారిగా వెంకటేశ్వర్లు, సంయుక్త కార్యదర్శులుగా చెలే నవీన్, వాసం నాగరాజు, రమేశ్, రామారావు, కోరం జానకిరావు, ఆర్గనైజింగ్ ఉద్యోగులు చెలే పాపారావు, చిచ్చడి గోవర్ధన్‌ను ఎన్నుకున్నారు.

పనుల పరిశీలన

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో రాష్ట్రదేవాదాయశాఖ కమీషనర్ వెంకట్‌రావు సరస్వతినది పుష్కరాల పనుల ఏర్పాట్లు పరిశీలించారు. మంగళవారం ఆయన త్రివేణి సంగమ వద్ద సరస్వతి ఘాటు ఏర్పాట్లు పరిశీలించి, అధికారులకు దిశానిర్దేశం చేశారు. సీఎం రానున్న, నేపథ్యంలో ఏర్పాట్లలో వేగిరం పెంచాలని ఆదేశించారు. ఆయన వెంట దేవస్థానం సిబ్బంది, అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, విజయలక్ష్మీ తదితరులు ఉన్నారు.

పార్టీ కార్యాలయానికి స్థలం కేటాయించాలి

భూపాలపల్లి రూరల్: జిల్లాకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయానికి అవసరమైన స్థలాన్ని కేటాయించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాశ్‌రెడ్డితో కలిసి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మంగళవారం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అశోక్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం ఇచ్చినవారిలో కాంగ్రెస్ రాష్ట్ర, జిల్లా, పట్టణ నాయకులు ఉన్నారు.

నేటినుంచి వేసవి శిబిరం

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల పరిధిలోని నేటి(బుధవారం) నుంచి ఆరో తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు వేసవి శిబిరం నిర్వహించనున్నట్లు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు పింగిలి విజయపాల్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులకు ఆటలు, కరాటే, సంగీతం, చిత్రలేఖనం, స్పోకెన్ ఇంగ్లీష్ అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మొగుళ్లపల్లి కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులను ఈ శిబిరానికి పంపించాలని కోరారు.

‘దళితులపై చిన్నచూపు సరికాదు’

కాటారం: దళిత ఎంపీ అయిన గడ్డం వంశీకృష్ణతోటి దళిత వర్గానికి చెందిన నాయకులను చిన్నచూపు చూడటం సరికాదని కాంగ్రెస్ నాయకుడు భూపెల్లి రాజు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రాజు మాట్లాడారు. కాటారం మండలంలో పలువురి కుటుంబాల పరామర్శకు వచ్చిన పెద్దపల్లి ఎంపీ దళిత నాయకులకు సమాచారం ఇవ్వలేదన్నారు. దళితులపై వివక్ష జరుగుతుందని పలుమార్లు ఎంపీ మాట్లాడటం జరిగిందని కానీ ఆయన తోటి దళితులకు మండలానికి వస్తున్నట్లు సమాచారం ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని దళితుల పక్షాన తెలియజేస్తున్నట్లు రాజు పేర్కొన్నారు.

పరామర్శ

చిట్యాల: మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ మండల నాయకుడు ఆరెపల్లి సమ్మయ్య అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మంగళవారం ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. అక్కడి పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని మెరుగైనా వైద్యం అందించాలని కోరారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొత్తూరి రాజిరెడ్డి, మండల నాయకులు పాండ్రాల స్వామి, పెరుమాండ్ల రవీందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

కరాటేతో ఆత్మవిశ్వాసం



కరాటే నేర్పిస్తున్న మాస్టర్ నజీర్ హుస్సేన్



సమ్మర్‌క్యాంప్‌లో కరాటే నేర్చుకుంటున్న విద్యార్థులు

- పాఠశాలలో సమ్మర్ కరాటే క్యాంపు ఏర్పాటు
- సాధన చేస్తున్న విద్యార్థులు

ఏటూరునాగారం: వేసవికాలంలో విద్యార్థులు టీవీలు, సెల్‌ఫోన్‌లకు ఆకర్షితులై వారి జీవితాన్ని చెడుమార్గంలో వెళ్లకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమ్మర్ కరాటే క్యాంప్‌ను ప్రారంభించింది. ఈ మేరకు మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో జిల్లా క్యాంప్‌ను చేపట్టారు. ఈ క్యాంప్ జూన్ 6వ తేదీ వరకు నిర్వహిస్తారు. నెల రోజుల పాటు ఈ శిక్షణ తరగతులను నిర్వహించనున్నారు. ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు విద్యార్థులకు కరాటే శిక్షణను జిల్లా కరాటే క్లబ్ కోచ్ అబ్బు మాస్టర్, హుస్సేన్ మాస్టర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. శరీర పటిష్టపర్చడం, వ్యాయామం, ధ్యానం, కరాటేలో మెళకువలతోపాటు స్వీయ రక్షణ వంటి విషయాలను వివరిస్తున్నారు. వేసవికాలం కావడంతో చిన్నారులు హుషారుగా ఈ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకుంటున్నారు.

సమ్మర్ క్యాంపుతో ఉపయోగం



సమ్మర్ క్యాంప్‌లో కరాటే శిక్షణ నేర్చుకోవడం వల్ల ఎంతో ఉపయోగంగా ఉంటుంది. ప్రతీ రోజు సాధన చేయడంతో వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. శత్రువుల నుంచి మనల్నీ మనం కాపాడుకోవడం ఎంతో సులభంగా ఉంటుంది.

– నజీర్ హుస్సేన్, కరాటే మాస్టర్, ఏటూరునాగారం

ఉత్సాహంగా ఉంది



కరాటే నేర్చుకోవడం వల్ల ఎంతో ఉత్సాహంగా ఉంటుంది. రోజు నేర్చుకుంటున్నా. ఉదయం, సాయంత్రం క్రమతప్పకుండా వెళ్తున్నా. కరాటే శిక్షణ నిత్యం నేర్చుకుంటా.

– యజ్ఞసాయిశ్రీ, ఏటూరునాగారం.

ఎంతో ఆత్మవిశ్వాసం



కరాటే నేర్చుకోవడం వల్ల ఎంతో ఆత్మవిశ్వాసం ఉంటుంది. జ్ఞాపకశక్తి, చురుకుదనంగా ఉంటుంది. కరాటే నిత్యం ప్రాక్టీస్ చేస్తున్నా. సమ్మర్ క్యాంపు ఎంతో ఉపయోగపడుతుంది.

– అలువాల విష్ణుశ్రీ, ఏటూరునాగారం

హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వం

- సీపీఎం జిల్లా కార్యదర్శి సాంబశివ



మాట్లాడుతున్న బీరెడ్డి సాంబశివ

వెంకటాపురం(కె): ఈనెల కార్మికుల హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఎం) మండల కమిటీ సమావేశం కుమ్మరి శీను అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి బీరెడ్డి సాంబశివ హాజరై మాట్లాడారు. 20న నిర్వహించే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్రంలో బీజేపీ నియంత పాలనకు వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి గ్యానం వాసు, కట్ల నర్సింహాచారి, చిట్టెం ఆదినారాయణ, కంఠం సత్యం, తోట నాగేశ్వరరావు, బాబురావు పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ అందజేత



వెంకటాపురం(కె): సమ్మె నోటీస్‌ను అందిస్తున్న కార్మికులు



వాజేడులో..

వెంకటాపురం(కె): ఈ నెల 20న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొంటామని ఎంపీడీఓ రాజేంద్ర పరసాద్‌కు సీఐటీయూ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు మంగళవారం సమ్మె నోటీస్‌ను అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి కట్ల నర్సింహాచారి మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టే సార్వత్రిక సమ్మెను అన్ని వర్గాల కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు జనగం శ్రీను, రంజిత్, విజయ్, క్ష్మణరావు, మధుబాబు, బుచ్చిబాబు, తదితరులు ఉన్నారు.

వాజేడు: పంచాయతీ కార్మికుల సంఘం యూనియన్ నాయకులు ఎంపీడీఓ విజయ, ఎంపీఓ శ్రీకాంత్ నాయుడులకు మంగళవారం సమ్మె నోటీస్ అందజేశారు. పంచాయతీ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు కంబాలపల్లి కొండయ్య, ఆదినారాయణ, సురేష్, బంధం సమ్మయ్య, గణపతి, సరబాబు, చంటి, రాంకీ తదితరులు ఉన్నారు.

అట్రాసిటి కేసు నమోదు చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

వాజేడు: ఆదివాసీ యువకుడిపై దాడి చేసిన గిరిజనేతరుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలని ఆదివాసీ నవ నిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షుడు కొర్స నర్సిమూర్తి, తుడుం దెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాయం జానకి రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని మండపాక గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మండపాక గ్రామానికి చెందిన తోలెం సర్వేశ్వరరావుపై నాగేంద్ర బాబు రాజు అనే విచక్షణా రహితంగా దాడి చేశాడని ఆరోపించారు. బాధితుడు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. తోలెం సర్వేశ్వరరావుపై జరిగిన దాడిని ఆదివాసీ సమాజంపై జరిగిన దాడిగా పేర్కొన్నారు. మొడెం నాగరాజు, సర్వేశ్వరరావు, కుంజ మహేష్, యుగందర్, కిరణ్ ఉన్నారు.

దాతలు దయ చూపండి..

- చర్మ వ్యాధితో బాధపడుతున్న మహేశ్
- ఆర్థిక సాయం కోసం వేడుకోలు



సాయం కోసం అర్థిస్తున్న చైతన్య

గోవిందరావుపేట: రోజు కూలి పని చేసి కుటుంబాన్ని పోషించుకునే ఇంటి పెద్దకు ఆపదొచ్చింది. అరుదైన చర్మ వ్యాధితో బాధపడుతున్నాడు. దీంతో భర్తకు మెరుగైన వైద్యం చేయించుకునేందుకు భార్య దాతలను సాయం అర్థిస్తోంది. గోవిందరావుపేట గ్రామానికి చెందిన బొజ్జ మహేష్ చైతన్య దంపతులకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. మహేష్ గోవిందరావుపేట మండలంలో కూలి పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఎనిమిది నెలల క్రితం చర్మంపై, నాలుకపై పొక్కులు రావడంతో హనుమకొండలోని పలు ఆస్పత్రులకు వెళ్లి చికిత్స చేయించుకున్నా ఫలితం లేకపోయింది. కాగా హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించి నాలుగు నెలల నుంచి చికిత్స చేయిస్తున్నారు. అయినా కూడా ఇప్పటి వరకు ఫలితం మాత్రం లేదు. ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించే స్థోమత లేదని, ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పందించి సాయం చేయాలని, దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సాయం అందించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని మహేశ్ భార్య చైతన్య దాతలను వేడుకుంటుంది.

కెనరా బ్యాంక్, పస్రా బ్రాంచ్, ఖాతా నంబర్ 6774101001909, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ సీఎన్ఆర్‌బీ0001923, ఫోన్‌పే నంబర్ 91214 08124 ద్వారా సాయం అందించాలని బాధితులు కోరుతున్నారు.

హనుమాన్ భక్తుల నగర సంకీర్తన



నగర సంకీర్తన చేస్తున్న హనుమాన్ భక్తులు

వెంకటాపురం(ఎం): మండలంలోని ఎల్లారెడ్డిపల్లెలో హనుమాన్ భక్తులు నగర సంకీర్తన చేశారు. హనుమాన్ చిత్రపటంతో గ్రామంలో వీధుల్లో తిరుగుతూ భజన పాటలు పాడుతూ భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన చేశారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ భక్తులు బేతి సతీష్, మెంతుల వంశీ, కొలనుపాక శివుడు, కుమార్, సదానందం, మధు, సాంబయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

భవనాలను తొలగించాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కన్నాయిగూడెం: మండలంలో అనుమతులు లేకుండా ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా నిర్మించి బహుళ అంతస్తుల నిర్మాణాలను తొలగించాలని తుడుందెబ్బ మండల అధ్యక్షుడు గుండ్ల పాపరావు ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వేణుగోపాల్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలో 1/70 చట్టానికి విరుద్ధంగా రెండంతస్తుల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. వెంటనే భవనంను తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్టం కలగకుండా చూడాలి



మాట్లాడుతున్న సురేందర్‌రెడ్డి

మొగుళ్లపల్లి: వరి కోసే సమయంలో నిర్ణీత ప్రమాణాలు పాటిస్తూ రైతులకు నష్టం కలగకుండా చూడాలి చూడాలని మండల వ్యవసాయాధికారి సురేందర్ రెడ్డి హార్వెస్టర్ నిర్వాహకులకి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో హార్వెస్టర్ యజమానులకు, డ్రైవర్లకు వరి కోతలో తీసుకోవాల్సిన అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. తప్పనిసరిగా ఆర్‌పీఎం 18 కంటే తక్కువ పెట్టొద్దని అన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు జోష్న తదితరులు పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణాలివ్వాలి

భూపాలపల్లి అర్బన్: నిరుద్యోగులకు ప్రభుత్వం ఎటువంటి షరతులు విధించకుండా రాజీవ్ యువ వికాసం రుణాలు ఇవ్వాలని సీపీఐ పట్టణ కార్యదర్శి సోత్కు ప్రవీణ్‌కుమార్ కోరారు. జిల్లా కేంద్రంలోని స్థానిక రావి నారాయణరెడ్డి భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సోత్కు ప్రవీణ్‌కుమార్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు రాజీవ్ యువ వికాసం కింద రుణాలు ఇచ్చి సొంతగా వ్యాపారం నిర్వహించుకోవాడానికి రూ.50 వేల నుంచి రూ.4లక్షల వరకు అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చిందన్నారు. దరఖాస్తులు స్వీకరించి, పరిశీలించిన తరువాత సిబిల్ స్కోర్ ఉన్న వాళ్లకే మాత్రమే రుణాలు ఇస్తామని చెప్పడం సిగ్గుచేటన్నారు. రోజు వారి కూలి పనులు చేసుకునే వారికి సిబిల్ స్కోర్ ఏ విధంగా ఉంటుందని ప్రశ్నించారు. ఈ సమావేశంలో నాయకులు క్యాతరాజు సతీశ్, వేముల శ్రీకాంత్, యాకుబ్ పాషా, పీక రవికాంత్, మేడి శ్రీకాంత్ ఉన్నారు.

సుందరీమణుల పర్యటనకు సిద్ధం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ దివాకర టీఎస్

- కలెక్టర్ దివాకర టీఎస్

వెంకటాపురం(ఎం): మిస్ వరల్డ్–2025 పోటీల్లో పాల్గొనేందుకు హైదరాబాద్ వచ్చిన సుందరీమణులు నేడు(బుధవారం) రామప్ప ఆలయాన్ని సందర్శించనున్న నేపథ్యంలో రామప్పలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ దివాకర టీఎస్ పేర్కొన్నారు. రామప్ప ఆలయాన్ని మంగళవారం కలెక్టర్ సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ నుంచి రామప్ప హరిత హోటల్‌కు చేరుకొని అక్కడి నుంచి సంప్రదాయ దుస్తులలో రామప్ప ఆలయాన్ని సందర్శిస్తారని తెలిపారు. రామప్ప ఆలయ సంస్కృతిని వివరించే విధంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పనులను పూర్తి చేశారన్నారు. సుందరీమణులు పర్యటన నేపథ్యంలో రామప్ప ఆలయానికి సందర్శకుల అనుమతి లేదన్నారు. భక్తులు, పర్యాటకులు సహకరించాలని కోరారు. భద్రత దృష్ట్యా రామప్ప నుంచి ఐదు కిలోమీటర్ల పరిసర ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలు ఎగురవేయడం పూర్తిగా నిషేధమన్నారు.

బందోబస్తులో అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ డాక్టర్ శబరీశ్



మాట్లాడుతున్న ఎస్పీ శబరీశ్

ములుగు: జిల్లాకు నేడు(బుధవారం) మిస్ వరల్డ్ కటెంస్టెంట్స్ వస్తున్న నేపథ్యంలో బందోబస్తుకు వచ్చిన సిబ్బంది ప్రతీ క్షణం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ డాక్టర్ శబరీశ్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలో బందోబస్తు కోసం వచ్చిన అధికారులు, సిబ్బందితో మంగళవారం మాట్లాడారు. హోంగార్డు నుంచి పైస్థాయి అధికారి వరకు ఎవరికి కేటాయించిన డ్యూటీ పాయింట్‌లో వారే ఉండాలన్నారు. నిర్లక్ష్యానికి తావు లేకుండా నిబద్ధతో విధులను నిర్వహించాలని సూచించారు. బందోబస్తులో అడిషనల్ ఎస్పీ, ఏఎస్పీ, ఇద్దరు డీఎస్పీలు, 14 మంది సీఐలు, 43 మంది ఎస్సైలు, 127 మంది ఏఎస్/హెచ్‌సీలు, 360 మంది కానిస్టేబుళ్లు, 160 మంది మహిళా కానిస్టేబుల్లు, 54 మంది హోంగార్డులు, 113 మంది టీజీఎస్పీ కానిస్టేబుళ్లు, 125 మంది స్పెషల్ పార్టీ కానిస్టేబుళ్లు విధుల్లో ఉండనున్నట్లు తెలిపారు. అనంతరం సమావేశానికి వచ్చిన వారితో మాక్ డ్రిల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ సదానందం, ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, డీసీఆర్‌బీ డీఎస్పీ కిషోర్ కుమార్, ములుగు డీఎస్పీ రవీందర్, సీఐలు, ఎస్సైలు సిబ్బంది ఉన్నారు.

రామప్ప ఆలయం ముస్తాబు



సాంస్కృతిక కార్యక్రమాల కోసం ఏర్పాటు చేసిన స్టేజీ

రామప్పకు నేడు (బుధవారం) సుందరీమణులు రానున్న నేపథ్యంలో రామప్ప ఆలయాన్ని సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. ఆలయం చుట్టూ గ్రీన్ మ్యాట్ వేశారు. ప్రత్యేక విద్యుత్‌దీపాలు ఏర్పాటు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల కోసం రామప్ప గార్డెన్‌లో స్టేజీ నిర్మించారు. మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్ రాత్రి భోజనం చేసే ఇంటర్ ప్రిటేషన్ సెంటర్ చుట్టూ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

– వెంకటాపురం(ఎం)



మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్ కోసం ముస్తాబైన హరితకాటేజీలు



రామప్ప ఆలయం వద్ద పోలీసుల బందోబస్తు



ఆలయం చుట్టూ ఏర్పాటు చేసిన గ్రీన్ మ్యాట్, లైటింగ్

పార్టీ కోసం కష్టపడిన వారికే పదవులు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

రేగొండ: కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కష్టపడ్డ వారికి తప్పకుండా అవకాశాలు లభిస్తాయని, పైరవీలతో పదవులు రావని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఉమ్మడి రేగొండ మండల కాంగ్రెస్ పార్టీ నేతలతో సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణే కాంగ్రెస్ సిద్ధాంతమని తెలిపారు. ఈ సందర్భంగా రేగొండ, కొత్తపల్లిగోరి మండలాలలోని వివిధ గ్రామాలకు చెందిన 55 మంది లబ్ధిదారులకి రూ.19,85,000 విలువ కలిగిన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ కార్పోరేషన్ చైర్మన్ ప్రకాష్‌రెడ్డి, జిల్లా పరిశీలకులుగా ఇనగాల వెంకట్రామరెడ్డి, మాసంపెల్లి లింగాజీ, రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గుటోజు కిష్టయ్య పాల్గొన్నారు.

పని చేసిన వారికి గుర్తింపు

భూపాలపల్లి రూరల్: పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపు లభిస్తుందని, పైరవీలతో పదవులు రావని, అర్హతలు ఉన్న వారికే పదవులు వస్తాయని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు రామచంద్రయ్య అధ్యక్షతన సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ ప్రక్షాళనలో పీసీసీ పరిశీలకుల బాధ్యత కీలకమైందన్నారు. అనంతరం పట్టణంలో ఎర్రం సతీష్ ఇంట్లో హనుమాన్ స్వాములకు భిక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు.